

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### పుస్తకాల పండగ వాయినాలు

**రచయితలు ఎలా పుడతారో చెప్పాను కదా.** ముందు తెలుసుకోవసిన విషయం కవి నిరంకుశుడు. అంకుశంకన్నా పదునైన తన అక్షరాలతో మోది బాది నెత్తురు కనిపించకుండా పైకి చంపగలడు.

ఒకప్పటి తరంలో మా తరం దాకా కూడా పత్రికలకి మంచి సాహితీ విజ్ఞానం వున్న ఎడిటర్లు వుండేవారు. వాకాటి పాండురంగారావుగారూ, పురాణం సుబ్రమణ్య శర్మగారూ, నామిని సుబ్రమణ్యం నాయుడుగారూ, శ్రీరమణగారూ, చలసాని ప్రసాదరావుగారూ, స్వాతి బలరాంగారూ, కనకాంబర రాజుగారూ నేను సీరియల్స్ రాసేటప్పుడు ఇలాంటి ప్రముఖ ఎడిటర్స్ వుండేవారు. వీరి బాధ్యత ఎంత వుండేది అంటే వచ్చిన కవితలని, రచనలని చదివి, పనికి రానివీ, పనికొచ్చేవీ పసి కట్టడం మాత్రమే కాదు ఆ రచన ఎలా వుంటే ఆమోద యోగ్యంగా వుంటుందో కూడా చెప్పేవారు.

చాలాకాలం క్రితం మా ఇంటికో అమ్మాయి వచ్చింది. అక్కా నేనో  కవిత రాసాను, చదువుతా విను అంది. నేను వింటున్నాను. "ఆకాశం నీలంగా వుంటుంది. నువ్వు నీలంగా వుండలేవు. ఎందుకంటే నువ్వు ఆకాశం కాదు కాబట్టి. పోస్ట్ బాక్స్ ఎర్రగా వుంటుంది. నువ్వు ఎర్రగా వుండలేవు. .. ఎందుకంటే "నువ్వు పోస్ట్ బాక్స్ కాదు కాబట్టి" అని నేను పూరించాను.

"అక్కా చూసావా? ఒక రచయిత్రి మనసు ఇంకో రచయిత్రే తెలుసుకోగలదూ" అంది.

"నీ తలకాయ ఆ పేపర్ ఇటివ్వు" అన్నాను.

ఇచ్చింది. అది పేపర్ కాదు. పెద్ద పుస్తకం. "ఆకశం...నిల్లగా వుంటుంది.. ఏదుకంటే" ఇలా వత్తుల్నీ గుణింతాలనీ అరాచకంగా, నిరంకుశంగా తొలగిస్తూ, చేరుస్తూ ఆమె కదన కుతుహలంతో కసరత్తు చేయించింది పెన్ని.

"ఏ పత్రికకైనా పంపించావా?" అడిగాను.

"పంపించాను" అంది.

"ప్రచురించారా?" అడిగాను.

కళ్ళు ఆర్పుతు గొంతు తగ్గించి "ఈ ఎడిటర్ల బంధువులవీ లేదా అందంగా వుండి వాళ్ళమాట వినే అమ్మాయిలవి మాత్రమే ప్రచురిస్తారుట కదా అక్కా"

"ఔనా?" నేనూ రహస్యంగానే అడిగాను.

"లేకపోతే ఎందుకు తిరిగొస్తాయి నా కవితలు? ఇంత బావుంటే?" అంది.

మరునాటి నుండీ నా పేరు చెప్పి, నేను మెచ్చుకున్నానని తన కవితలు చెప్తూ తిరిగింది ఆ అమ్మాయి  అది వేరే సంగతి.

"ఎవరైనా బావున్నాయి అన్నారా?" అని అడిగితే "మా సరుకుల కొట్టు లింగయ్య శెట్టి బావున్నాయి అన్నాడు. అన్నీ తనే బొత్తిగా అడిగి తీసుకున్నాడు" అంది. వాటిలో అందరికీ చింతపండూ, పుట్నాల పప్పూ కట్టి ఇస్తే పాపం ఎంతమందికి అరగక వాంతులయ్యాయో అనిపించింది.

ఇంకోడున్నాడు మనం కనిపించగానే, జేబులోంచి షిరిడీ సాయిబాబా ఫోటో ఇస్తాడు. తర్వాత "మీరో మహా సముద్రం. విజ్ఞానానికి మారుపేరు. మహోన్నత మానవత్వం" అంటూ పది ప్రశంసా వాక్యాలు రాసి కింద ఒక ఖాళీ స్థలంలో మన పేరు కూడా రాసి ఇచ్చి "అక్కా నీమీద నా గుండె నిండా వున్న ప్రేమ ఎప్పటినుండో రాసుకుని, నువ్వు కనిపిస్తే ఇద్దామని అక్కడ దాచాను" అంటాడు.

ఆ తర్వాత చెయ్యి జాపి "నీ మనసు నాకు తెలుసు. ఏదీ ఉచితంగా తీసుకోవు. ఒక వెయ్యి సర్దావనుకో మెస్ బిల్ కట్టేస్తా. లేదా ఐదు వందలైనా సరే" అంటాడు.

అలా వ్యాపార మెళుకవలు తెలిసినవాడు నిజంగా బావున్న రచనలూ, నవలలూ, కథలూ ప్రచురితం అయికూడా పత్రికలలో, పుస్తకాలు వేసుకునేవారికి కూడా, ఆ పబ్లిషర్స్, ఎం. శేషాచలం అండ్ కో, (ఎమెస్కో) లేదా నవసాహితీ, నవోదయా, ఇలాంటి ప్రచురణ కర్తలు "అమ్మా ఈ నవలలో ఈ తప్పులున్నాయి, సరిదిద్దుకోండి. నవలగా వచ్చేముందే అని ప్రూఫ్ రీడింగ్ టైములోనే చెప్పేవారు" అలా సీరియల్స్‌లో లేని ముగింపులు, నవలగా చదివేటప్పుడు వచ్చినవి కూడా వుండేవి.

ఆ బంగారు రోజులూ, నాణ్యతగల పత్రికలూ, బాధ్యతగల ఎడిటర్లూ కాలం చెల్లాక ఇప్పుడొస్తున్న రచయితల గురించి చెప్పాలంటే, వీళ్ళు ముందు ఎఫ్.బిలో ప్రయోగిస్తారు. ప్రజలమీద విసిరి. అయితే ఎఫ్.బి యూజర్స్ సో కాల్డ్ 'ఫ్రెన్స్' అనబడే వాళ్ళు మొహం స్థానంలో అక్కడ మీ కుక్కపిల్ల ఫేస్ అతికించి ప్రొఫైల్ పిక్ పెట్టినా సరే "వావ్.. ఆ సమ్.. ఈ సమ్.. సమ్.. సమ్" అని వెనక్కి విరుచుకుపడిపోతున్న ఇమోజీలు గుప్పించేస్తారు. అలాంటిది మీరు రాసే చాంతాడు కవిత్వం

ఎవరు చదువుతారు? కింద అద్భుతం, ఆహా.. ఏమి రచనా? అని పెట్టేస్తారు. ఓసారి కాంతం అనే రచయిత్రి పుస్తకంలో రాసిన కవిత ఒకటి ఫోటో పెట్టింది. అందరూ తెగ పొగిడారు. "ఆసమ్.. ఎమేజింగ్... వండ్రఫుల్" అని.

కింద వాళ్ళాయన మాత్రం, "మన చాకలిపద్దు ఇక్కడెందుకు పెట్టావు?" అని కామెంటాడు. అప్పుడు చూసా పైన ఏం రాసిందా అని.. ఇలా వుంది.

'బొందులేని లంగాలు 4 '

'గళ్ళ చారల పైజమాలు 3 '

'హుక్కు లేని జాకెట్టులు 6 '

'ఫాల్ లేని చీరలు 3 '

గంజి పెట్టకూడని కుర్తాలు 2 '

ఈ కవిత 'హైలైట్' చెయ్యబడి, జూకర్‌బర్గ్ అనబడే ఫేస్‌బుక్ ఓనర్ ఆమెని 'ఆథర్' అన్న టాగ్‌తో 'సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్' అన్న బిరుదుతో గౌరవించుకున్నాడు.

మొన్న 200 పై చిలుకు పుస్తకాలు రాసి తన నవలలతో ఉర్రూతలూగించి, ఆ తర్వాత మోటివేషనల్ స్పీకర్ అయిన మా గురువుగారిని ఈ సోకాల్డ్ ఎఫ్.బి జూకర్ 'మీ పోస్ట్‌లు మా విజ్ఞానానికి తగినట్లు లేవు కాబట్టి, ఇంకో ఎకౌంట్ తెరవండి' అని, నిరంకుశంగా ఆయన ఎకౌంట్ బ్లాక్ చేసాడు. అతని కొలమానం ఏవిటో విజ్ఞానం అంటే మరి.

ఇంక ఇప్పటి రచయితల గురించికదా మాట్లాడుకుంటున్నాం.

వాట్సప్‌లో, ఫేస్‌బుక్‌లో వాళ్ళు రాసిన ఇంటి కబుర్లూ, వాళ్ళ ఆయన గురించీ రోజూ రాసి, ఓ బుక్ వేయించుకుంటారు. మీకు గుర్తుండి వుంటే ఇలాంటి గులాకారులని గుర్తించి పుస్తకాలు వేయించే ఆకురాతమ్మా, కుతూహలయ్యలకి కొదవలేదు గదా. ఎవరి వ్యాపారం వాళ్ళది. వీళ్ళని బాగా గౌరిగించి, గోపీ చందనం పెట్టించి ఓ పుస్తకం వేస్తారు.

ఆ పుస్తకాలన్నీ బుక్ ఫేర్‌లో ఓ షాప్ బాడుగకి తీసుకుని, బెంచీ వేసుకుని పెట్టి, ఫలానా స్టాల్‌లో మా బుక్స్ కొనండి.. ప్లీజ్ అని అభ్యర్థిస్తారు. ఆ స్టాల్‌కి మనం రెండు మూడు గజాల దూరంలో వున్నా, వచ్చి బలాత్కారంగా లాక్కెళ్ళిపోయి, మన చేత ఓ నాలుగు పుస్తకాలు కొనిపిస్తారు. అందుకు ఓ టీ, రెండు మిర్చీబజ్జీలు ఖర్చు అయినా సరే. వాళ్ళ పోరు పడలేకో, మొహమాటం వల్లనో కొన్నా అవి మనం చదవకూడదు ఎందుకంటే 'అమ్మ అన్నది కమ్మని మాట' అనే ఓ పుస్తకం కొని, మా ఇంటికొచ్చిన మా అమ్మకి ఇచ్చా. అంతే.. ఆవిడ నాలుగు పేజీలు చదివి, 'ఛీ..ఛీ.. అమ్మ అన్న పదం అంటేనే చిరాకు పుట్టింది. ఏం మంచి సంగతులు రాసిందని వాళ్ళమ్మ గురించీ?" అని నన్ను ఆ పుస్తకం తనకిచ్చినందుకు తెగ తిట్టింది.

ఇంకొకావిడ పెద్ద చదువులు చదివి, పెద్ద ఉద్యోగం చేసి రిటైర్ అయింది. ఘనంగా పుస్తకావిష్కరణ చేసి, వీ.వీ.ఐ.పి లని పిలిచి, ఆ పుస్తకం కాపీనాకిచ్చింది. ఓపెన్ చేస్తే మొదటి కథ 'మన ప్రయాణాలు' టైటిల్ ఆసక్తిదాయికంగా అనిపించి చదవసాగాను. 'రైలులో భోన్‌గిరి వచ్చింది.. పల్లీలు అమ్మొచ్చాయి... వరంగల్ వచ్చింది జీళ్ళు అమ్మొచ్చాయి.. కాజీపేట వచ్చింది కాజాలమ్మొచ్చాయి... కర్నూల్ వచ్చింది గోలీసోడా అమ్మొచ్చింది.." ఇలా సాగుతూనే వుందా ప్రయాణం. పెద్ద పెద్ద వాళ్ళు ఇలా చవకబారుగా ఎలా రాస్తారో అర్ధంకాదు.

సరే వేయించుకున్నారు పుస్తకాలు? ఎన్ని అమ్ముడుపోతాయి? పుస్తకావిష్కరణకి మొహమాటానికొచ్చిన అతిధులూ, అభ్యాగతులకి వందకాపీలు పంచిపెట్టినా, ఇంకా నాలుగొందలు వీరి ఇళ్ళ బీరువాలకీ, దసరాలకీ జాకెట్టు బట్టా, శనగలూ పుస్తకం వాయినంగా ఇంటికి పిలిచి ఇచ్చేవారు కొందరూ. అయినా చెల్లవు పాపం. ఆడాళ్ళు అయితే మొగుళ్ళూ, మగాళ్ళూ అయితే పెళ్ళాలూ రోజూ వాటిని దుమ్ము దులపలేక, స్థలం చాలక ఇంట్లో తిడ్తూనే వుంటారు.

ఇంకొకాయన ఇంటికి పిలిచి ఎఫ్.బిలో అందరినీ "భోజనానికి రండి" అని, భోజనం పెట్టి తన పుస్తకాలు నాలుగు సెట్లే మిగిలాయి, ఐదు సెట్లే మిగిలాయి. ఆలసించిన ఆశాభంగం లెవెల్లో ఎఫ్.బి ప్రకటనలిచ్చి మరీ అవి సెట్స్ కింద తలా ఆరువందలూ, వెయ్యి రూపాయలకీ అంటగడ్తాడు. ఒకసారి వెళ్ళినవాళ్ళు మళ్ళీ వెళ్ళరు. కారణం భోజనం ఆయన రచనలకన్నా నాసిగా వుండడం.

ఇంకొక అత్తయ్యగారు, వరుసలు కలిపి, పుస్తకాలు ప్రచురించిపెట్టండి. 'మీరు నా పిల్లల్లాంటివారు' అని సెంటిమెంట్‌తో చర్మం వూడి వచ్చేట్లు కొట్టి గోళ్ళూడదీసి డబ్బులు వసూలు చేసి పుస్తకాలు వేయించుకుంటుంది.

వీళ్ళకి ఎవరి స్వభావం చాలా వీకో.. ఎలా పడిపోతారో.. ఏ సెంటిమెంట్‌తో కొట్టాలో, గ్రేట్ అబ్జర్వేషన్ వుంటుంది. సరే అవి గొప్ప పుస్తకాలయితే పబ్లిషర్స్ వెంటపడి మరీ ప్రచురిస్తారు. గొప్ప అంటే సేల్ వున్నవి అని అర్థం. డబ్బులు పెట్టి పుస్తకం కొనేవాడు పిచ్చివాడు కాదు. అందులో చదివించే గుణం, విషయం వుంటేనే ఎవడైనా జేబులోంచి డబ్బులు తీసి కొంటాడు.

ఇంకా కొందరు "మా పుస్తకాలు ఫలానావాళ్ళు  షేర్ చేసేసారు. ఆడియో కథలుగా చదివేసారు. చట్టరీత్యా వాళ్ళ మీద కేసులు వేసి ఎంత వసూలు చెయ్యొచ్చు?" లాంటి ఎఫ్.బి పోస్ట్‌లో పెడ్తారు. తప్పులేదు. కానీ వాళ్ళ రచనలు ఫ్రీగా ఇచ్చినా చదివిన పాపాన పోని వాళ్ళు పాపం ఆ ఆడియో రచనలు మాత్రం ఏం వినగలరు చెప్పండీ?

మనం రాసినవి మంచి రచనలా కాదా? అని తెలుసుకోడానికి కనీసం వంద పుస్తకాలు చదవండి. పక్కవాళ్ళు అంతా ఇంగ్లీషునుండి  కాపీ కొట్టేసి రాసేస్తున్నారు. వాడు ఉత్త వెదవాయి..ఈవిడ కేరెక్టర్ మంచిది కాదు కాబట్టి పుస్తకాలు వేస్తున్నారు అని ఏడిచేవాళ్ళు నాకు ఎదురుపడ్డారు. వీళ్ళు ఎప్పుడూ పుస్తకాలు చదవరు. కొడవటిగంటీ, విశ్వనాధా, చలం, బుచ్చిబాబూ అంటే మీ చుట్టాలా? అనీ ఇంట్లో రబీంద్రుడి ఫోటో పెట్టుకుంటే, మీ తాతగారా?" అని అడిగే బ్యాచ్.. వీళ్ళకి

మిగతా రచయితలంటే చులకన. ఫేస్‌బుక్‌లో పొగిడే పనిలేని వెయ్యిన్నర మందీ తమ 'ఫ్యాన్స్' అనుకుంటారు. పబ్లిక్ మీటింగ్‌కి వచ్చిన జనం అంతా ఎలక్షన్స్‌లో ఓట్లు వేసి గెలిపిస్తారనే భ్రమలో వుండే వెర్రి నాగన్నలలాంటివాళ్ళు పాపం. వీరు పుస్తకం వేయించగానే, ఎగబడి వీళ్ళంతా వచ్చి కొంటారని కలలు కంటారు. మొదటిసారి కలకి ఎబార్షన్ అయ్యేదాకా తెలీదు. ఊహకీ వాస్తవానికీ తేడా.


ఇలా మోసపోయిన సోమిదేవమ్మలూ వీళ్ళని ఉసిగొలిపే ఫేస్ బుక్ ఫ్రెండ్స్, యధేచ్ఛగా పుస్తకాలు వేయించుకుంటూ, వాయినాలిచ్చుకుంటూ వుంటారు. వాయినంలో ఇచ్చే రాళ్ళలాంటి బత్తాయిపండ్లు తీసుకోండి. కానీ తినాలని ప్రయత్నించకండి. ఈ పుస్తకాలు అంతే.

ఓ వంద మంచి పుస్తకాలు, మన తెలుగు జాతి గర్వించే కవులవి చదవండి. అప్పుడు పెన్ లేదా సిస్టం పట్టండి. ప్రజాక్షేమం దృష్ట్యా చెప్తున్నాను.










Post your comments